


షాపింగు చేయడమనేది ఒక ఆర్టు. ఈ ఆర్టు ఆడవాళ్ళకి ప్రత్యేకం. మగవాడు ఏమి కొన్నా దండగే. మగవాడు బేరంచేయలేడు. బేరం చేయడం అతనికి నామోషీగా వుంటుంది. బేరమాడుతూంటే ఎక్కడ తన స్టేటస్ పడిపోతుందోనని భయం, సిగ్గు. అమ్మేవాడు తన నెక్కడ అవమానిస్తాడో నని దిగులు. అందుచేత అర్థరూపాయ వస్తువుని రెండున్నర చెబితే కళ్ళు మూసుకుని కొనేస్తాడు మగవాడు. అదే వస్తువుని అరగంట బేరమాడి పావలాకి కొంటుంది అబల. బేరమాడి కొనడం వాళ్ళకది జన్మహక్కు.

ఈ థియరీకి మినహాయింపులు కూడా వున్నాయి. కొందరు మగ వాళ్ళు బేరమాడి కొనడంలో ఆడవాళ్ళకే మాత్రం తీసుపోరు. అందులో మాధవరావుకి మంచి కీర్తి ప్రతిష్ఠలున్నాయి. అతను మిమ్మల్ని మార్కెట్టుకు

రమ్మని పిలుస్తే వెళ్ళకండి. వెళ్ళేరో మీ కష్టం చెప్పనలవి కాదు. బేర మాడటంలోనూ నాణ్యత చూసుకోవడంలోనూ మాధవరావుని మించిన వస గాడు భూలోకంలో మరొకడుండడు. అయితే అతనెప్పుడూ వంటరిగా షాపింగుకి వెళ్ళడు. తోడుండాలి. ఒకరికి ఇద్దరుంటే ఎన్నిక బావుంటుందని అతనుద్దేశం. టూకీగా అతని షాపింగు కార్యక్రమం ఇట్లా సాగుతుంది:

తనతో షాపింగుకి తీసుకెళ్ళే ఫ్రెండుకి ఓం ప్రధమంగా ఏ తాజమహా ల్లోనో కాఫీ గ్లాసులు కొట్టిస్తాడు. ఈ పెట్టుబడికి రెండు కారణాలు చెప్పుకోవాలి. వస్తువు కొనాలనుకుంటే రెండో మూడో గంటలు పడుతుంది. గనక తాగిన కాఫీ కొంత శక్తినిస్తుంది. ఇది మొదటి కారణం. తన డబ్బుతో కాఫీ తాగించిన ఫ్రెండు మొహమాటానికి ఎట్లాగూ పడిపోతాడు. గనక బేరం తొందరగా ముగించమని తొందర పెట్టడు. ఇది రెండో కారణం.

కొనేది ఆఫ్టరాల్ చొక్కాగుడ్డే కావచ్చు. అందుకు పదహారు కొట్లు తిరుగుతాడు. ఫ్రెండుని కూడా తిప్పుతాడు. కొట్లో పదో, పదహారో వెరైటీలు చూస్తారు. ఇదెట్లా వుంది, ఇదెట్లా వుందని ఫ్రెండుని అభిప్రాయం చెప్పమంటాడు. నాకు తెలీదంటే ఊరుకోడు. ఒక చిత్రమైన చూపు చూస్తాడు. నా ఖర్చుతో కాఫీ తాగేవు. అప్పుడే మర్చిపోయావా మిత్రమానే హెచ్చరిక ఆ చూపులలో తళుక్కున మెరుస్తుంది. కనుక వచ్చినట్టు తనకి తోచిన అభిప్రాయాన్ని చెప్పాలి. మన్నించి కొనేస్తాడా అంటే కొనడు. షాపువాడు వలసై చెబుతాడు. మాధవరావు ఇరవై మూడంటాడు. షాపువాడు పురుగుని చూసినట్లు చూస్తాడు. మాధవరావు సిగ్గుపడడు గాని అతని పక్కనున్న ఫ్రెండుకి మాత్రం చచ్చినంత అవమానంగా ఉంటుంది. ఇట్లాగ ఈ తంతు పదహారు కొట్లలోనూ జరుగుతుంది. ఎరక్కపోయి మాధవరావుతో వచ్చి అతని కాఫీ తాగి లొంగిపోయినందుకు ఆ ఫ్రెండు లోలోపల దుంఖిస్తాడు. పంచ భూసస్సాలా. వీడిచేత బేరం ముగించి చొక్కా గుడ్డ కొనేలా చేయండి అట్లు కానిచో తల పగుల గొట్టుకు ఛస్తాను అని అతను ఒట్టేసుకున్న తర్వాత మాధవరావు చొక్కా గుడ్డ కొంటాడు.

ఆ చొక్కా-గుడ్డ గనక ఆరు నెలల్లో చిరుగులు పడితే ఆనాడు తనతో వచ్చిన ఫ్రండెవరో గుర్తుంచుకుని అతన్ని నానా బూతులూ తిడతాడు. వాడి మూలంగానే నిలువుగా మునిగిపోయే నంటాడు. కొనూ కొనూమని ఒకటే తొందరచేస్తే కొన్నా గానీ, లేకపోతే ఈ దరిద్రానికి పాతికెందుకు తగలెడతానూ అంటూ కనిపించిన ప్రతి మనిషి దగ్గరా ఏడుస్తుంటాడు. ఈ హింస భరించలేక ఫ్రండవే పెద్దమనిషి దండం పెడితేనేగానీ శాపనార్థాలు ఆగవు.

ఏదైనా చెప్పి ఎవరైనా నమ్మించాలంటే ఫలానా సాక్షి అంటూ ఒట్టేసుకోవడం ఒక ఆదారం. కాని మా మిత్ర బృదం ఒట్టు, వల్లకాడూ వదిలేశారు. నేను అబద్ధం చెప్పినట్టు రుజువైతే నన్ను మాధవరావుతో మార్కెట్‌కి పంప డనే హామీ ఒట్టుకంటే పవర్‌ఫుల్ వెపన్‌గా మేమంతా ఎంచుకుంటాం. ఇప్పుడైనా మాధవరావు ఘనతేమిటో సహృదయులు అర్థం చేసుకోగలరు. మాధవరావు ఆడజన్మ ఎత్తివుంటే క్షేమం పట్టించుకొనే వాళ్ళం కాదు. మగపుటుక పుట్టి మగజాతికి తలవంపులు తెస్తున్నాడు మహానుభావుడు.

నా మటుకు నేనుకూడా కొంచెమో, గొప్పో బేరమాడుతానుగాని మరీ అంత నీచంగా దూసుకుపోలేను. అసలీ బేరమాడటం కూడా ఇంట్లో భయపడే నేర్చుకున్నాను. బత్తాయిలు కొన్నా, కూరగాయలు తెచ్చినా నా బేరం మా ఆవిడకు సుతారామూ నచ్చదు. నన్ను వాళ్ళు బాగా మోసం చేసేరని తేల్చి పారేస్తుంది. అమ్మే వాళ్ళంతా మోసగాళ్ళనే సిద్ధాంతం మా ఆవిడకు బాగా పంట బట్టింది. ఇంక దానికి తిరుగులేదు.

అబద్ధం చెప్పయినా సరే, నా బేరం పట్ల మా ఆవిడ మెప్పుని పొందాలనుకున్న, మొన్నీ మధ్య ఏడైె కమలాలు గొప్పగా బేరమాడి పన్నెండు రూపాయలకు కొన్నాను. ఇంట్లో మాత్రం ఎనిమిది రూయలే అని మాత్రం కోసేను. ఓహో అంటుందనుకున్న మాఆవిడ హయ్యయ్యో అని అరచి పడిపోయింది. ఆర్రూపాయల కంటే ఎక్కువ చేయదని సర్టిఫికెట్ యిచ్చింది. ఎంత దారుణం?

రేఁపెక్కువని పక్కింటి వాళ్ళకి భాగం పంచుతుందేమో అప్పుడు మరింత అన్యాయమై పోతానని కోపం నటించి నేనూ అరిచేను. నా డబ్బు నా యిష్టం అన్నాను. ఎనిమిది కాకపోతే పన్నెండు తగలేస్తాను. దీన్లో భాగాలు వేస్తే నా మీద ఒట్టే అన్నాను. స్నానానికి వెడుతుండగా ఎదురింటి మీనాక్షమ్మగారు మా యింటికి రావడం చూసేను. ఆమె మా యింటికి వచ్చి వెళ్ళిన ఎఫెక్టు ఆ మరుసటి రోజున గానీ తెలిసింది గాదు ఆఫీసుకి వెళుతుండగా మీనాక్షమ్మగారి భర్త దార్లో ఎదురుపడి ఎంతో దిగులుతో యిచ్చై పోయి అన్నాడు.

"కమలాలు డజను మూడున్నర చొప్పున తెచ్చేను. మీరు అంత కంటే చీప్‌గా తెచ్చేరని మా ఆవిడ చెప్పింది. అంత చీప్‌గా మీకెవ డిచ్చేడండీ అన్నాడు." ఎవడిచ్చేడో ఏం చెప్పను. అబద్దం చెప్పినా మా ఆవిడ నన్ను హర్షించలేదు. పైగా మా యింట్లో రియాక్షన్ ఎదురింటికి వెళ్ళిపోయింది. ఆ మానవు డెంత ఖంగారు పడ్డాడో దేవుడికే తెలియాలి. అందుకే ఫిల సాఁకల్‌గా నవ్వేసి ఊరుకున్నాను.